క్లుప్తంగా

ఆశాలపై భారం మోపడం తగదు

మదనపల్లె : హెడ్‌కౌంట్ సర్వే చేసేందుకు అవసరమైన పేపర్స్ జిరాక్స్‌కు డబ్బులు ఆశా కార్యకర్తలే ఖర్చు పెట్టుకోవాలని మెడికల్ అధికారులు వారిపై భారం మోపడం తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ మొత్తాన్ని ఆశా కార్యకర్తలు ఎక్కడి నుంచి భరించగలరో వైద్యాధికారులే సమాధానం చెప్పాలన్నారు.

విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ


విద్యార్థులకు స్వెటర్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనాథ్

మదనపల్లె సిటీ: స్థానిక ఫైర్ స్టేషన్ వద్దనున్న బాలసదనంలో గురువారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. చలికాలం దృష్టిలో ఉంచుకుని అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు శ్రీనాథ్ తెలిపారు. బాలసదనంలో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీనాథ్, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి విరాళం


అనాథ శరణాలయానికి సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న షాహీద్ అహ్మద్

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సోషల్ రెస్పాన్స్‌బుల్ క్లబ్ కదిరిలోని సేవా భారతి అనాథ శరణాలయానికి సోలార్ లైట్, ప్రొజెక్టర్ స్క్రీన్, రెండు ఫ్యాన్లు తదితర వాటిని అందజేసినట్లు ఆక్లబ్ కో ఆర్డినేటర్ షాహీద్ అహ్మద్ గురువారం తెలిపారు. అక్కడి అనాథ పిల్లలకు కూడా భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిట్స్ కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు రూ. 25 వేలు సేకరించి అనాథ శరణాలయానికి కావాల్సిన డస్ట్ బిన్‌తో పాటు ఇతర అవసరమైన సామగ్రిని అందజేశామని తెలిపారు.

ఎరువుల లారీ బోల్తా

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి సమీపంలోని కందుకూరు రోడ్డులో గురువారం ప్రమాదవశాత్తు ఎరువును తరలిస్తున్న ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. కోళ్లఫారంకు ఎరువును తీసుకెళ్తుండగా మలుపు వద్ద లారీ బోల్తా పడింది.

లే అవుట్ల పరిశీలన

పెద్దతిప్పసముద్రం: హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి గురువారం మండలంలోని పలు హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. పక్కా గృహాల నిర్మాణాలు ఎందుకు వేగవంతం కావడం లేదో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాల కారణంగా గృహాలు వేగవంతం కావడం లేదని అధికారులకు వివరించారు. లేఔట్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని డీఈ హామీ ఇచ్చారు.

రెండు బైక్‌లు ఢీ


ములకలచెరువు: రెండు బైక్‌లు ఎదురెదురుగా స్థానిక మండల కేంద్రంలో గురువారం ఢీ కొనడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో సత్యసాయి జిల్లా ఎర్రబల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డికి (55)కి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స చేయిస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ


డివైడర్‌ను ఢీకొన్న లారీ

పీలేరురూరల్ : స్థానిక కడప రోడ్డు మార్గంలో అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఓ లారీ డివైడర్‌ను ఢీకొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. కడప నుంచి తమిళనాడుకు వెలుతున్న లారీ తెల్లవారుజామున డివైండర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

సారూ..! జీతాలివ్వండి


ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న స్వీపర్లు

పెద్దతిప్పసముద్రం: జీతాలివ్వకుండా గోస పెడుతున్నారని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం స్వీపర్లు గౌరమ్మ, లక్ష్మిదేవి, సావిత్రమ్మ, అరుణమ్మ, ఆదెమ్మ, రాధమ్మ తదితరులు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట గోడు వెళ్ల బోసుకున్నారు. ఈ విషయంపై ఎంఈఓ నారాయణను వివరణ కోరగా బడ్జెట్ విడుదల కాగానే పెండింగ్ జీతాలన్నీ స్వీపర్ల ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు.

మిర్చి సాగుకు సై

- 'ఎర్ర బంగారం' వైపు రైతన్నల మొగ్గు
- కొత్త రకం మిర్చి సాగుతో లాభార్జన
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

'తింటే గారెలే తినాలి.. వింటే భారతం వినాలి' అనేది పాత సామెత. 'పండిస్తే మిర్చి పండించాలి.. లాభాలు దండిగా పొందాలి' అనేది నేటి రైతన్నల సంకల్పం. ప్రస్తుతం అధిక లాభాలు కురిపించే పంట ఏదైనా ఉందంటే అది మిర్చినే. మిర్చి తోటలకు చాకిరీ ఎక్కువ.. పెట్టుబడీ ఎక్కువే.. మరి రాబడి కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. అందుకే రైతన్నలు మిర్చి సాగువైపు మొగ్గు చూపుతున్నారు.


పీలేరు మండలంలో సాగు చేసిన మిరప

పీలేరురూరల్ : కొత్తరకం మిరపకు ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉండడంతో రైతులు మిరప సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 50 హెక్టార్లలో మిరప సాగు చేశారు. కొందరు రైతులు ఎకరా, అర ఎకరాల్లో మిరపసాగు చేయగా, మరికొందరు రైతులు ఐదు నుంచి ఏడు ఎకరాల్లో సాగు చేశారు. స్థానిక మార్కెట్ కంటే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తే మిరపకు మంచి గిరాకీ ఉందని రైతులు చెబుతున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతుల్లో.. మండలంలోని గూడ రేవుపల్లె పంచాయతీ కంకర ఫ్యాక్టరీ ప్రాంతంలో రైతు వెంకటేశ్వరరావు ఎడెకరాల పొలంలో మిరప (మిర్చి) సాగు చేశాడు. అధునాతన వ్యవసాయ పద్ధతిలో పొలం దుక్కి దున్ని మల్చింగ్ ఏర్పాటు చేసి కొత్తరకం మిరప 2.043 రకం విత్తనాన్ని సాగు చేశాడు. అలాగే మండలంలోని ముదుపులవేముల పంచాయతీ టానా వడ్డిపల్లెలో రైతు ఆది మూడెకరాల్లో మిరప సాగు చేసి విజయవంతమయ్యారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు

మిరప పంటను కాపాడుకోవడానికి రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి ఉద్యానశాఖ అధికారులు పలు సూచనలిస్తున్నారు. వారి సూచనల మేరకు మిరపను ఎక్కువగా ఆశించే రసం పీల్చే తామర పురుగుల నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుముడత లకు కారణమయ్యే నల్లి నివారణకు స్పైరో మెసిఫెన్ 0.6 మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నత్రజని ఎరువులను ఎక్కువగా వాడరాదు, ఎరువులు వాడకంలో సమతుల్యత పాటించాలి. కాయకుళ్లు, కొమ్మకుళ్లు గమనించినట్లయితే నివారణకు అజాక్సిస్ట్రోబిన్ 1 మిల్లీలీటరును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బహుళ ప్రయోజనాలు



రైతులు మల్చింగ్ షీట్‌ని పరచి మిరప సాగు చేస్తే బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. దీంతో భూమిలో తేమ ఆరిపోకుండా, నీటిని 30 నుంచి 70 వరకు ఆదా చేయవచ్చు. కలుపు బెడద 85 శాతం తగ్గుతుంది. నాలుగు సంప్రదాయ పద్ధతితో పోలిస్తే మల్చింగ్ షీటు పరచిన పొలంలో ఎరువులను మొక్కలు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటాయి.
– సుకుమార్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి, పీలేరు

పంట ఆశాజనకంగా ఉంది



కర్ణాటకలో సాగు చేసిన 2.043 రకం మిరప మంచి దిగుబడి, లాభార్జన వస్తుందని తెలుసుకున్నాను. దీంతో ఆ రకం విత్తనం తెచ్చి ఏడెకరాల్లో రూ. 15 లక్షలు వెచ్చించి మిరప సాగు చేశాను. పంట కాయ దశలో ఉంది. పంట కోత అనంతరం ఎండు మెర్చిగా తయారు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.
– వెంకటేశ్వరరావు, రైతు, పీలేరు

ప్రజలకు అండగా ఉందాం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

కలికిరి (వాల్మీకిపురం): ప్రజలకు అండగా ఉందామని, వారి సమస్యలపై పోరాటం చేద్దామని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చింతపర్తిలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే చింతల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందని, ప్రశ్నించిన మీడియా గొంతు నొక్కుతూ అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. అధికార గర్వంతో కూటమి ప్రభుత్వం విర్రవీగుతోందని, ప్రభుత్వ బెదిరింపులకు నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరికి కష్టం వచ్చినా కలిసి కట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

పరామర్శ

మండల పరిధిలోని మూరేవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘునాథరెడ్డి తల్లి ఇంద్రావతమ్మ ఉత్తర క్రియలు సందర్భంగా వారి స్వగృహానికి చేరుకుని ఇంద్రావతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఇదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు యర్రా రామచంద్రారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారం తెలుసుకుని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అలాగే స్థానిక నేత పులి చంద్రశేఖర్ రెడ్డి తల్లి పార్వతమ్మ మృతి చెందిన సమాచారం తెలుసుకుని ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, వాల్మీకపురం వైస్ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డిరాజారెడ్డి, ద్వారకనాథరెడ్డి, కేశవరెడ్డి, మాజీ ఎంపీటీసీ వాసు, వేమనారాయణ రెడ్డి, రాజారెడ్డి, మంచూరు శంకర్ రెడ్డి, కూరపర్తి శివారెడ్డి, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం మానవత్వానికి ప్రతీక


రక్తదానం చేస్తున్న యువకులు

కలికిరి (వాల్మీకిపురం): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేసేందుకు ముందుకు రావడం మానవత్వానికి ప్రతీక అని సామాజిక కార్యకర్త సాగుబడి లావణ్య రెడ్డి అన్నారు. వెల్ విషర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన మరువలేనిదని కొనియాడారు. రక్త దానం చేసిన వారు ప్రాణదాతలతో సమానమని ప్రశంసించారు. దేశ వ్యాప్తంగా ఏ ప్రాంతంలోనైనా ఫ్రెండ్స్ టూ సపోర్ట్ మొబైల్ యాప్‌తో అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు భార్గవ్, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది, సాగుబడి ఆనందరెడ్డి, కార్తికేయరెడ్డి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

గుర్రంకొండ: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శులను డీపీఓ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక సచివాలయంలో మండలంలోని అన్ని సచివాలయాలకు చెందిన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్తను తొలగించి పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. 15 ఆర్థిక సంఘం నిధులు గ్రామాలకు మంజూరు ఆయ్యాయని పారిశుద్ధ్య పనుల కోసం వీటిని వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో సేకరించే చెత్తను పొడి, తడి చెత్తగా విభజించాలని, ఇందుకోసం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను నియమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశులు, ఈఓపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

తంబళ్లపల్లె: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు చేయడం తప్పనిసరని ఎంపీడీఓ ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో సుమారు 3,900 బ్యాంకు ఖాతాలు ఆగిపోయాయని వాటిని పునరుద్ధరించి ఎన్‌పీసీఐ లింకు చేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, బీపీఎంలు సమన్వయంతో ఇంటికి వెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకు ఖాతాలేని వారికి పోస్టాఫీసుల్లో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు ఖాతా ప్రారంభించాలని పేర్కొన్నారు.

ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా

బి.కొత్తకోట: బి.కొత్తకోట 17వ మహిళా సంఘమిత్ర లక్ష్మిని తొలగించి మరొకరిని నియమించడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. లక్ష్మి నిర్వహిస్తున్న వీఓ నుంచి ఆమెను తొలగిస్తూ కొన్నిరోజుల క్రితం అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కొత్త సంఘమిత్రగా గౌతమిని నియమించారు. ఈ నేపథ్యంలో సంఘమిత్ర గౌతమి తన పరిధిలోని మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించగా మహిళలు బహిష్కరించారు. అక్కడి నుంచి ఐకేపీ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. లక్ష్మిని తిరిగి సంఘమిత్రగా నియమించాలని డిమాండ్ చేశారు.

మధుమేహంపై అవగాహన

రామసముద్రం: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురువారం మాలేనత్తం పంచాయతీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా ప్రజలకు అవగహన కల్పించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్ష మరియు నోటి క్యాన్సర్, గర్భాశయం ముఖద్వారం క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. మధుమేహం రోగులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

నిమ్మనపల్లె : సీసీ రోడ్ల నిర్మాణాలలో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండయ్య గారి పల్లెలో పల్లె పండుగ ద్వారా వేసిన సీసీ రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లకు త్వరగా బిల్లులు చెల్లించాలని ఏపీడీ, ఏపీలను ఆదేశించారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో పల్లె పండుగ ద్వారా రూ.1.50 కోట్లతో 40 పనులు మంజూరయ్యాయని తెలిపారు. కొండయ్య గారి పల్లెలో రూ.7.5 లక్షలతో 202 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలికిరి క్లస్టర్ ఉపాధి హామీ ఏపీడీ శ్రీనివాసులు, నిమనపల్లె ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగశ్రీ అవార్డులు ప్రదానం


యోగశ్రీ అవార్డులు ప్రదానం చేస్తున్న షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మి

పీలేరు : స్థానిక షీ సంస్థ, బెంగళూరుకు చెందిన వివేకానంద యోగ అనుసంధానం సంస్థాన్ (వ్యాస) సంయుక్త ఆధ్వర్యంలో యోగశ్రీ అవార్డులు ప్రదానం చేశారు. స్థానిక భువన విద్యాలయంలో విద్యార్థులకు నిత్య యోగ సాధన శిక్షణ ఇచ్చారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మి విద్యార్థులకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్స్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి యోగ విద్యను అభ్యసించడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. లీగల్ అడ్వైజర్ రాయల సుధాకర్, పాఠశాల యాజమాన్యం ఉమారమాదేవి, గుణలక్ష్మి, తిరుపతి మ్యాక్స్ అకాడమీ సీఈఓ తుమ్మల వెంకటరావు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట


వృద్ధుడికి బీపీ చెక్ చేస్తున్న వైద్యురాలు

పీలేరు : అవగాహన, ముందస్తు పరీక్షలతో కేన్సర్ ముప్పు నుంచి జాగ్రత పడవచ్చని జిల్లా ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శివప్రతాప్ అన్నారు. గురువారం పీలేరులో చేపట్టిన సమగ్ర ఆరోగ్య సర్వే ఎన్‌సీడీ 3.0 క్యాన్సర్ పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షలతో అంతర్గతంగా దాగిఉన్న వివిధ ఆరోగ్య సమస్యల నిర్ధారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలన్నీ వినియోగించుకుని ఆరోగ్యంగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం భార్గవి, రేణుక, సీహెచ్‌ఓలు చంద్రకళ, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ గోకులాలు త్వరగా పూర్తి చేయాలి

పీలేరురూరల్ : మినీ గోకులం నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతులకు మినీ గోకులంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ. 1.21 కోట్ల రూపాయలతో 53 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, ఒక్కో యూనిట్ విలువ రూ. 2.30 లక్షలు చొప్పున మంజూరైనట్లు తెలిపారు. 9.3 మీటర్లు పొడవు, 3.3 మీటర్ల వెడల్పుతో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించి ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మహేశ్వర్, డాక్టర్ సాదిక్, జేఈ సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు


కేవీపల్లె : బాలల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈఓ రెడ్డిబాషా


కలకడ : కోన ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దతిప్పసముద్రం: నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లలు చిన్న వయసు నుంచి మంచి నడవడిక అలవరచుకోవాలని ఎంఈఓ నారాయణ, గౌస్‌పీర్ అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో, విద్యలో ప్రతిభ కనబరచిన పిల్లలకు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు సూరి, శంకర్, రామాంజులు, రాములు చైర్మన్ నరసింహులు పిల్లలకు బహుమతులు అందజేశారు.

కలకడ : నేటి బాలలే రేపటి పౌరులని కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మోడెం చంగల్‌రాయుడు అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పడిట్ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ఎంఈఓ సురేంద్రబాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాచానెహ్రూ పుట్టినరోజునే మనమందరం బాలల దినోత్సవంగా జరుపుకొంటామన్నారు. హెడ్మాస్టర్ ముక్తియార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి పిల్లలే రేపటి తరానికి దిక్సూచి

కేవీపల్లె : నేటి పిల్లలే రేపటి తరానికి దిక్సూచి కావాలని ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. గురువారం మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ జంగంపల్లె ఎంపీయూపీ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు గాంధీ, నెహ్రూ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తిత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

మదనపల్లె సిటీ: భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్, బావజాన్, ఆర్.వి.రమణ, పీడీలు దేవకమ్మ, సుధాకర్ పాల్గొన్నారు. స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. అలాగే స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలలో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

రామసముద్రం: రామసముద్రం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. మట్లవారిపల్లి, తూర్పు పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో హెచ్ ఎం బాలసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్, హెచ్ ఎం హేమలత లు బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ బాలాజీ, నాయకులు సీతారామయ్య, రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మదనపల్లె సిటీ: పథకాలు సాధించిన విద్యార్థులతో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

పుస్తక పఠనం.. విజ్ఞాన సోపానం


మదనపల్లె సిటీ: గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి


పీలేరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


గుర్రంకొండ: మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్రమణ్యం

పీలేరు : విద్యార్థులు పుస్తక పఠనం విద్యార్థుల విజ్ఞానానికి సోపానమని గ్రంథాలయాధికారి అమరనాథ్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సురేంద్రనాథ రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహులు, రెడ్డికుమారి, బేబమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు

గుర్రంకొండ: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలకు ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలంలో గ్రంథాలయాలను దేవాలయాలతో సమానంగా భావించేవారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సమాచారంతో పాటు పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని వసతులు గ్రంథాలయాల్లోనే అందుబాటులో ఉండేవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రెడ్డికుమారి, ఉపాధ్యాయులు షబానా, విద్యార్థులు పాల్గొన్నారు.

కలకడ : గ్రంథాలయాలు విధ్యా బాండాగారాలని కలకడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.వి.పద్మావతి అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయ శాఖలో గ్రంథాలయ అధికారి అమరనాథ్ ఆధ్వర్యంలో గ్రాంథాలయ వారోత్సవలను ప్రారంభించి ప్రసంగించారు. కథలు, నవలలు చదవడం వలన విద్యార్థులలో మేధోశక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సిటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినాగ్రంథాలయాల ఎంఈఓ-2 రాజగోపాల్ మాట్లాడుతూ డీఎస్సీ విద్యార్థుల కోసం 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు టెక్స్‌బుక్స్ సెట్‌ను గ్రంథాలయానికి ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, జీఎంఆర్ పాలిటెక్నిక్ రిటైర్డు లైబ్రేరియన్ జనార్దన్‌రెడ్డి, ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ క్రిష్ణమూర్తి, తిరుపతిరావు, మునిగోపాలకృష్ణ, సహదేవరావు, యుగంధర్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే బాండాగారాలని టీచర్ రెడ్డప్పరెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నెహ్రూ జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. గ్రంథాలయ ప్రాముఖ్యత గురించి వివరించారు. గ్రంథాలయాధికారి జిలానీబాషా, టీచర్ వెంకట్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

కలికిరి: గ్రంథాలయ వారోత్సవాలను గురువారం కలికిరి గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జేఎన్టీయూలో..

జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి డా.జప్రున్నీషా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.